తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 37 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ శనివారం 7-9-2023 వెల: 5/రూ -




పాఠకులకు,
శ్రేయోభిలాషులకు, రిపోర్టర్లకు
వినాయక చవితి శుభాకాంక్షలు.

వినాయక చవితి సందర్భంగా శనివారం సంస్థ కార్యాలయానికి సెలవు. కావున ఆదివారం పత్రిక వెలువడదు.



## సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ ఇకలేరు

అనారోగ్యంతో కన్నుమూసిన కవి

సంతాపం తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# టీపీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్ గౌడ్

పార్టీ అగ్రనాయకులు తనపై విశ్వాసం ఉంచారన్న మహేశ్ కుమార్ గౌడ్

రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీలకూ కృతజ్ఞతలు తెలిపిన మహేశ్ కుమార్

తెలంగాణ పీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్‌ను నియమించిన అధిష్ఠానం



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ హైకమాండ్ ఫైనల్ చేసింది. ఈ మేరకు ఆయన పేరును ఏఐసీసీ అధికారికంగా వెల్లడించింది. బీసీ వర్గానికి చెందిన నేతకే పీసీసీ పగ్గాలు అప్పగించింది కాంగ్రెస్ అధిష్టానం. ఇక, ప్రస్తుతం మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్సీగా ఉన్నారు. 2023లో పీసీసీ ఎన్నికల కమిటీ సభ్యుడిగా పని చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..'నాపై అత్యంత నమ్మకంతో నాకు కీలకమైన టీపీసీసీ అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి హృదయ పూర్వక ధన్యవాదాలు. పార్టీ అప్పగించిన ఈ గొప్ప బాధ్యతలను చిత్తశుద్ధితో అంకిత భావంతో పని చేసి పార్టీని మరింత బలోపేతం చేస్తాను. నిరంతరం కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటూ పార్టీకి, ప్రభుత్వానికి అనుసంధానంగా పని చేసి రాష్ట్రాభివృద్ధికి, పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తాను. ఇంతకాలం నాకు అన్ని రకాలుగా సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు


(మిగతా 2వ పేజీలో)




## వ్యవసాయ క్షేత్రంలో కెసిఆర్ నవగ్రహ యాగం

మర్కుక్: సిద్దిపే ట జిల్లా, మర్కుక్ మండలం, ఎర్రవల్లి గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో మాజీ సిఎం కెసిఆర్ దంపతులు శుక్రవారం మహా నవగ్రహయాగం నిర్వహించారు. యాగశాలలో వేద పండితు ల మంత్రోచ్ఛారణల మధ్య నవగ్రహ యాగం ఎదుట జ్యోతి ప్రజ్వలన చేసి యాగం ప్రారంభించారు. యాగం కొనసాగేందుకు వీలుగా ముందుగా మ హాగణపతి పూజ నిర్వహించారు. అనంతరం నవగ్రహ యాగంలో మహా మంగళ హారతి, పుష్పాభిషేకం, అష్టావధాన సేవ తదితర కార్యక్రమాలు వేద పండితులు నిర్వహింపజేశారు. అనంతరం కెసిఆర్ దంపతులు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, మా జీ ఎంఎల్ఎలు, జెడ్పిటిసిలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# వరదలతో దెబ్బతిన్న రాష్ట్రాలకు కేంద్రం చేయూత


విపత్తు నిర్వహణ నిధి నుంచి రూ.3,448 కోట్ల సాయం


2లో


సుమారు 5,438 కోట్ల నష్టం జరిగినట్లు సిఎం రేవంత్ వెల్లడి

# కొత్త విజయవాడను చూపిస్తా

హుద్‌హుద్‌లో విశాఖను తీర్చిదిద్దినట్టే వరద తాకని నగరంగా మారుస్తా



నష్టపోయిన వారిని నిలబెట్టడం పెద్ద సవాల్

కేంద్రం ఉదారంగా ఆదుకుంటుందని ఆశిస్తున్నా

వేగంగా సాయం పంపిణీకి ఏర్పాట్లు

కేంద్ర సాయంపై వస్తున్న వార్తలు వదంతులే

మేం ఇంకా నివేదికే పంపలేదు: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 6 : వరద ముంపు ఉండని కొత్త విజయవాడను చూపిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. 'హుద్‌హుద్ తుఫాన్‌లో చిన్నాభిన్నమైన విశాఖను తర్వాత ఒక అందమైన నగరంగా తీర్చిదిద్దాం. అలాగే విజయవాడ రూపురేఖలు మారుస్తాం" అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడ కలెక్టరేట్‌లో మాట్లాడారు. "మానవ తప్పిదాలతో విజయవాడ మునిగింది. బుడమేరు ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి, గట్లను గత ప్రభుత్వం పటిష్ఠం చేసి ఉంటే ఇవాళ ఈ వరద ఉండదు. లక్షల మందికి ఇంత శోకం ఉండదు. బుడమేరు గట్టుకు పడిన గండ్లలో ఇంకా ఒకటి పూడ్చాల్సి ఉంది. ఆర్మీ నిపుణులను కూడా తీసుకువచ్చాం. వరద నడుస్తుండగా గండిని పూడ్చడం క్లిష్టంగా ఉందని వాళ్లు కూడా చెబుతున్నారు. అయినా పెద్ద పోరాటం చేస్తున్నాం. రేపటికి గండి పూడ్చే అవకాశం ఉంది. ఈ వాగుకు నిన్న తొమ్మిది వేల క్యూసెక్కుల వరద రావడంతో అందులో కొంత విజయవాడలోకి మళ్లీ ప్రవహించి కొన్నిచోట్ల ముంపు పెరిగింది. ఈ రోజు రాత్రికి వాన పడకపోతే రేపటికి గండి పూడు స్తాం. కాబట్టి ఇబ్బంది ఉండదని అనుకొంటున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

### ఇవ్వగలిగినంత చేయూత అందిస్తా...

వరదల్లో నష్టపోయిన వారిని నిలబెట్టాలన్నది తన తపనని, దానిపైనే దృష్టి పెట్టి పనిచేస్తున్నానని చంద్రబాబు తెలిపారు. "వ్యాపారాలు చేసుకొనేవారు బాగా దెబ్బతిన్నారు. ఇళ్లలో సామాన్లు నాశనం అయ్యాయి. వాహనాలు దెబ్బతిని నష్టపోయారు. ఇవన్నీ నేను నాకళ్లతో చూశాను. వీరిని ఎలా ఆదుకోవాలన్నది సమస్య. బీమా కంపెనీలు కొర్రీలు వేయకుండా త్వరగా పరిహా రం ఇచ్చేలా చూస్తున్నాం.



## మోదీ, బాబు అండగా ఉంటారు

రైతులు ఎవరూ అధైర్య పడొద్దు

అన్ని విధాలుగా సాయం చేస్తాం

ఎరువులు, విత్తనాలు అందజేస్తాం

వైసీపీ సర్కారు 'ఫసల్ బీమా'కు

ప్రీమియం కట్టకపోవడంతో రైతులకు నష్టం: శివరాజ్ సింగ్

తెనాలి/అమరావతి, సెప్టెంబరు 6,గన్నవరం: రైతులు ఎవ రూ అధైర్య పడొద్దని, ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు అండగా ఉంటారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భరోసా ఇచ్చారు. ఇదే విషయాన్ని తెలియజేయాలని కేంద్రం తనను పంపిందన్నారు. ఏ ఒక్కరూ కన్నీరు కార్చొద్దని, ఆందోళన చెందాల్సిన పనిలేదని, రైతుల జీవితాల్లో మళ్లీ వెలుగులు

# ఆదిమూలంపై అత్యాచారం కేసు

బాధిత మహిళ ఫిర్యాదుతో

తిరుపతి పోలీసుల కేసు నమోదు



వైద్య పరీక్షలకు బాధితురాలి నిరాకరణ

చెన్నైలోని ఆసుపత్రిలో ఎమ్మెల్యే కోనేటి

విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు

తిరుపతి, సెప్టెంబరు 6 : తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. ఆదిమూలం తనను బెదిరించి బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డారంటూ తెలుగు మహిళా నాయకురాలు గురువారం రాత్రి తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు క్రైమ్ నంబరు 430/24తో ఐపీసీ 376, 506(భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 64, 351-2) కింద కేసు నమోదు చేశారు. సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలానికి చెందిన బాధితురాలు గురువారం హైదరాబాద్‌లో మీడియా ఎదుట ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని టీడీపీ నుంచీ సస్పెండ్ చేశారు. ఆ క్రమంలో గురువారం రాత్రి బాధితురాలు తన భర్తతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూలై 6, 17న తిరుపతిలోని భీమాస్ ప్యారడైజ్ హోటల్‌కు పిలిచి బలవంతంగా తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తరచూ ఎమ్మెల్యే ఫోన్లు చేస్తుండడంతో తన భర్త తనను నిలదీశారని, దీంతో భర్తకు జరిగిన విషయం చెప్పినట్టు తెలిపారు. అగస్టు 10వ తేదీన అదే హోటల్‌కు రమ్మని ఎమ్మెల్యే ఫోన్ చేయడంతో.. తన భర్త సూచనల మేరకు పెన్ కెమెరాలో తనను బలాత్కరించడాన్ని వీడియో రికార్డు చేశానని పేర్కొన్నారు. కాగా, బాధితురాలి ఫిర్యాదుతో సీఐ మహేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం బాధిత మహిళను వైద్య పరీక్షల నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అయితే వైద్య పరీక్షలు అవసరం లేదంటూ మొండికేయడంతో పోలీసు అధికారులు, వైద్యులు ఆమె నుంచీ లిఖితపూర్వకంగా

## సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ ఇకలేరు

**అనారోగ్యంతో కన్నుమూసిన కవి**

**సంతాపం తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 : ప్రముఖ కవి, సినీ గేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ(76) హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఇటీవల ఆటా వేడుకల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన ఆయన, ఆరోగ్యం దెబ్బతినడంతో జూలై 16న హైదరాబాద్ దవాఖానలో చేరారు. వడ్డేపల్లి సిరిసిల్లలో ఓ చేనేత కుటుంబంలో జన్మించగా, హైదరాబాద్‌లోని నాగోల్‌లో స్థిరపడ్డారు. రెండ్రోజుల క్రితమే తెరసం ఆయనకు జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసింది.వడ్డేపల్లి కృష్ణ మృతిపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాహిత్య రంగంలో ఆయన సేవలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణ మృతికి కవులు, కళాకారులు, రచయితలు, సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

## కొత్త విజయవాడను చూపిస్తా

ఇస్తున్నారు. దీనితోపాటు డ్రై ప్యాకేజీ కింద ఆరు నూడుల్స్ ప్యాకెట్లు, ఆరు యాపిల్స్, ఆరు లీటర్ల మంచినీళ్లు, రెండు లీటర్ల పాల ప్యాకెట్లు, ఆరు బిస్కట్ ప్యాకెట్లు కూడా ఇస్తున్నారు. శనివారం వరకూ ప్రభుత్వ సిబ్బంది.... సుమా రు నలభై వేల కుటుంబాలకు వీటిని పంపిణీ చేస్తారు. ఆదివారం నుంచి రేషన్ షాపుల్లో పెట్టి అక్కడ నుంచి అందరూ తీసుకువెళ్లే ఏర్పాటు చేస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి వీటిని తీసుకోవచ్చు. ఆకు కూరలు రెండు రూపాయలు, కొన్ని రకాల కూరగాయలు కిలో ఐదు, మరి కొన్ని కిలో రూ.10 రేటు పెట్టి ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వం తరపున విక్రయిస్తున్నారు. శుక్రవారం నలభై వేల కిలోల కూరగాయలు తెప్పించారు. శనివారం నుంచి ఇంకా ఎక్కువ తెప్పిస్తున్నారు. శుక్రవారం ఒక్క రోజే పదకొండున్నర లక్షల మంచినీళ్ల బాటిళ్లు, నాలుగున్నర లక్షల పాల ప్యాకెట్లు, ఆరు లక్షల బిస్కట్ ప్యాకెట్లు, డెబ్బై ఐదు వేల కొవ్వొత్తులు, ఏభై వేల అగ్గిపెట్టెలు సరఫరా చేశారు. కాగా, ముంపు ప్రాంతాల్లో ఏడువేల మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పటికి 12 వేల టన్నుల చెత్తను తీశా రు. 110 ఫైర్ ఇంజన్లు రోడ్లు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లు శుభ్రం చేస్తున్నాయి. నీళ్లు ఉన్న ప్రాంతాల్లోని 23 వేల కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో కరెంటు సరఫరా పునరుద్ధరించారు. 15 డ్రోన్లు ఆహారం పంపిణీ చేస్తున్నాయి. విజయవాడ ముంపు ప్రాంతంలో ఉచిత బస్సులు పెట్టామని తెలిపారు.

**కేంద్ర సాయంపై వదంతులు..**

రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్రం రూ. 3300 కోట్లు సాయంగా ప్రకటించిందని వచ్చిన వార్తలు ఒట్టి వదంతేనని చంద్రబాబు స్పష్టం చేశారు. వరద నష్టంపై తాము ఇంకా నివేదిక కూడా పంపకుండానే కేంద్రం ఎలా సాయం ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. నివేదికను శనివారం కేంద్రానికి పంపుతున్నట్లు ఆయన తెలిపారు. కాగా, బుడమేరు కట్ట తెగిన ప్రాంతంలో హెలికాప్టర్‌లో సీఎం శుక్రవారం ఉదయం ఏరియల్ విజిట్ చేశారు. బుడమేరు ఏఏ ప్రాంతాలగుండా ప్రవహించి కొల్లేరు సరస్సులో కలుస్తున్నదీ, అక్కడి గ్రామాల పరిస్థితి ఏమిటనేదీ ఆయన పరిశీలించారు.

**పండగరోజూ కలెక్టరేట్‌లోనే బాబు**

శనివారం వినాయక చవితి పండగ రోజు కూడా విజయవాడ కలెక్టరేట్‌లోనే ఉండిపోవాల ని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. "శనివారం వినాయక చవితిని కలెక్టరేట్‌లోనే చేసుకొంటున్నా ను. ఇంటికి వెళ్లడం లేద"ని తెలిపారు. విజయవాడ నగరం గతంలో ఎన్నడూ లేనంత స్థాయి లో వరద ముంపునకు గురి కావడంతో ఆయన కలెక్టరేట్‌లోనే గత వారం రోజులుగా ఉంటున్నా రు. బాత్రూం సదుపాయం ఉన్న బస్సును కలెక్టరేట్ ఆవరణలో పెట్టి ఆయన అందులోనే పడుకొంటున్నారు. పండగ రోజు కూడా అక్కడే ఉండిపోవాలని ఆయన నిశ్చయించారు. వరద సహాయక కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో తాను పక్కకు వెళ్తే మళ్లీ అవి గాడితప్పే ప్రమా దం ఉందన్నారు. బాధితులకు లేని పండగ మనకెందుకని ఆయన వ్యాఖ్యానించినట్లు ఒక మంత్రి చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలోనే ఒక చోట వినాయకుడి విగ్రహం పెట్టి శనివారం అక్కడే పూజ చేయాలని నిర్ణయించారు. పూజ ఏర్పాట్లు చూడటానికి కనకదుర్గ ఆలయానికి చెందిన అర్చకులు కలెక్టరేట్‌కు శుక్రవారం వచ్చారు.

## వరదలతో దెబ్బతిన్న రాష్ట్రాలకు కేంద్రం చేయూత

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలం అయిన తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కేంద్ర ప్రభుత్వం భారీ సాయం ప్రకటించింది. విపత్తు నిర్వహణ నిధి నుంచి రూ.3,448 కోట్లను కేంద్రం కేటాయించింది. తక్షణ సహాయం అందించడానికి ప్రక్రియ జరుగుతోందని, ఈ నిధుల్లో కేంద్రం వాటా కూడా ఉందని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లో సంభవించిన వరదల సహాయ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇవాళ శుక్రవారం తెలంగాణలోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. సామాన్య ప్రజలు, రైతులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. అంతకు ముందు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో కూడా పర్యటించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సమర్థతతో పని చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటనలో శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరద నష్టం తీవ్రంగా ఉందని, తక్షణ సాయంతో పాటు శాశ్వత పునరుద్ధరణ పనులకు తగిన నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు.

## ఆదిమూలంపై అత్యాచారం కేసు




అంశాలను నిర్ధారించుకోవడంతో పాటు ఫిర్యాదు వెనుక కుట్ర జరిగిందా? అన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతున్నట్టు సమాచారం. అధికార పార్టీ మహిళా నేత ఫిర్యాదు కావడంతో కేసును అత్యంత ప్రాధాన్యంగా భావించి ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి, క్రైమ్ విభాగాలతో కూడా సమన్వయం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుంటే, బాధిత మహిళ గది నుంచి రిసెప్షన్ వద్దకు రెండు సార్లు వచ్చి వెళ్లిన దృశ్యాలు హోటల్ సీసీ టీవీ కెమెరాలో రికార్డయినట్టు తెలిసింది. ఆ దృశ్యాలు స్పష్టంగా ఉన్నాయని సమాచారం. దీంతో సంబంధిత హార్డ్ డిస్కును స్వాధీనం చేసుకున్న పోలీసులు దాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నట్టు తెలిసింది.

# ఉద్యమనేత జిట్టా కన్నుమూత

**అనారోగ్యంతో బీఆర్ఎస్ నేత బాలకృష్ణారెడ్డి మృతి**

**కొంత కాలంగా బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌కు చికిత్స**

**భువనగిరిలో అంత్యక్రియలు.. జిట్టా మృతికి కేసీఆర్ దిగ్భ్రాంతి**



హైదరాబాద్/యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 6 : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. నెలన్నరగా మృత్యువుతో పోరాడి శుక్రవారం ఉదయం 11.47గంటలకు తుదిశ్వాస విడిచారు. బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో గత నెలన్నరగా సికింద్రాబాద్‌లోని యశోదా దవాఖానలో చికిత్స తీసుకుంటున్నారు. జిట్టా మరణవార్తతో భువనగిరి శోకసంద్రంలో మునిగిపోయింది. జిట్టా పార్థివదేహాన్ని భువనగిరిలోని ఆయన ఫామ్‌హౌస్‌కు తరలించారు. తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నేత, జిట్టా బాలకృష్ణారెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపాన్ని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన పోరాటంలో జిట్టా బాలకృష్ణారెడ్డి క్రియాశీలకంగా పాల్గొన్నారని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. వారి మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**జిట్టా ప్రస్థానం ఇలా..**

జిట్టా 1972 డిసెంబర్ 14న జిట్టా బాల్‌రెడ్డి (రిటైర్డ్ టీచర్), రాధమ్మ దంపతులకు జన్మించారు. సొంతూరు భువనగిరి పట్టణ పరిధిలోని బొమ్మాయిపల్లి. ఆయనకు భార్య సునీత, కుమారుడు వివేకానందరెడ్డి, కూతురు ఝాన్సీ ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో యువజన సంఘాలను ఏకం చేయడంలో జిట్టా కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌తో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమంలో మంచి పేరు తెచ్చుకున్న జిట్టాకు రాజకీయంగా కలిసిరాలేదు. భువనగిరి ఎమ్మెల్యేగా పలు దఫాలుగా పోటీ చేసినా అదృష్టం కలిసిరాలేదు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో పని చేశారు. వివిధ పరిణామాల నేపథ్యంలో సొంతంగా యువ తెలంగాణ పార్టీ స్థాపించారు. ఆ తర్వాత పార్టీని బీజేపీలో విలీనం చేశారు. అటు నుంచి కాంగ్రెస్, తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన తల్లి రాధమ్మ పేరున కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.106 గ్రామాల్లో వాటర్ ఫిల్టరు ఏర్పాటుచేయించారు. తెలంగాణ జాతర, ధూంధాం కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారు. భువనగిరిలో జూనియర్ కాలేజీ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేశారు.

**అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు**

ప్రజానేతకు భువనగిరి జనం అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జిట్టా పాడెను మోశారు. జిట్టా బాలకృష్ణారెడ్డి అంత్యక్రియలు ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు డిమాండ్ చేశారు. పార్థివ దేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తుండగా అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డిని అడ్డుకునేందుకు యత్నించారు.

# టీపీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్ గౌడ్



ధన్యవాదాలు. నాకు పదవి రావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు అంటూ కామెంట్స్ చేశారు. కాగా, తెలంగాణకు కొత్త పీసీసీ అధ్యక్షుడిని నియమించేందుకు కాంగ్రెస్ పార్టీ నెలల సమయం తీసుకుంది. ఆగస్టు 23న పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై సుదీర్ఘంగా చర్చించిన హై కమాండ్ పెద్దలు. విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన మహేష్ కుమార్ గౌడ్. కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాలలో మహేష్ కుమార్ గౌడ్‌కు పట్టుంది. దక్షిణ తెలంగాణ నుంచి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉండడంతో ప్రాంతీయ సమీకరణాల దృష్ట్యా ఉత్తర తెలంగాణ నుంచి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్‌ను హైకమాండ్ ఎంపిక చేసింది. ఓసీ సామాజిక వర్గం నుంచి సీఎంగా రేవంత్ రెడ్డి, ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, బీసీ సామాజిక వర్గం నుంచి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్‌ను ఎంపిక చేశారు. కుల సమీకరణలను దృష్టిలో ఉంచుకొని అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. కాంగ్రెస్ హై కమాండ్ పెద్దలతో మహేష్ కుమార్ గౌడ్ క్రియాశీల సంబంధాలు కలిగి ఉన్నారు. అంతకుముందు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. ఆ స్థానంలో మమేష్ కుమార్ గౌడ్‌ను ఎంపిక చేశారు. ఇక, రేవంత్‌కు అత్యంత సన్నిహితుడైన మహేశ్ కుమార్ గౌడ్‌ను పీసీసీ పీఠం వరించడం విశేషం.

**రాజకీయ ప్రస్థానం ఇలా..**

నిజామాబాద్ జిల్లాలోని భీంగల్ మండలంలోని రహత్ నగర్‌లో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మించారు. నిజామాబాద్ గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 1986లో నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశాడు. ఆయన ఆ తరువాత 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డిచ్‌పల్లి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా చిన్న వయస్సులోనే పోటీ చేసి ఓటమి చెందారు.

- 2013 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పని చేశాడు.
- 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయాడు.
- అనంతరం, పీసీసీ కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.
- 2018లో నిజామాబాద్ అర్బన్ టికెట్ ఆశించారు. కానీ, అధిష్ఠానం మైనార్టీలకు కేటాయించడంతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు.
- మహేష్ కుమార్ 2018 సెప్టెంబర్ 18న రాష్ట్ర ఎన్నికల కమిటీలో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా నియామకం.
- 2021 జూన్ 26న పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, 2022 డిసెంబర్ 10న కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కార్యనిర్వాహక కమిటీలోప్రత్యేక ఆహ్వానితుడిగా ఎంపికయ్యారు.
- 2023 జూన్ 20న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీ-పీసీసీ) ఎన్నికల కమిటీలో సభ్యుడిగా నియమితుడయ్యాడు.
- 2024 జనవరి 29న తెలంగాణ శాసనమండలిలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గెలుపొందారు. రెండు స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఆయన పేరును కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించింది.
- జనవరి 31న తెలంగాణ శాసనమండలి సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు.




## 'ఈ పదేళ్ల పాలన సువర్ణాక్షరాలతో లిఖించాల్సిందే!'

జమ్ము కశ్మీర్ స్వయంప్రతిపత్తి అధికరణ 370.. కనుమరుగైన చరిత్ర అని, అది ఎన్నటికీ మళ్లీ తెర మీదకు రాబోదని బీజేపీ సీనియర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుండబద్దలు కొట్టారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంతో శుక్రవారం బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారాయన. భారత దేశ చరిత్ర.. అందులో జమ్ము కశ్మీర్‌కంటూ కొన్ని పేజీలుంటే 2014-2024 మధ్య పాలనను సువర్ణాక్షరాలతో లిఖించాల్సిందే. కానీ, ఒక్క విషయం స్పష్టం చేయదల్చుకున్న. ఆర్టికల్ 370 ఎన్నటికీ తిరిగి రాదు. అది గతించిన అధ్యాయం అని అన్నారాయన. బీజేపీ పాలనకు ముందు జమ్ము కశ్మీర్ ఎలా ఉండేదో దేశం మొత్తానికి తెలుసు. 2014 దాకా ఉగ్రవాదంతో పాటు వేర్పాటువాదం ఇక్కడ రాజ్యమేలేవి. ఇక్కడి పరిస్థితులను కొందరు అవకాశవాద రాజకీయాల కోసం ఉపయోగించుకున్నారు. కానీ, బీజేపీ పదేళ్ల పాలనలో ఇక్కడ ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా కట్టడి అయ్యాయి అని పేర్కొన్నారు. 1947 నుంచే జమ్ము కశ్మీర్ మా హృదయాలకు దగ్గరగా ఉండేది. ఇది ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగమే. ఇక్కడ శాంతి స్థాపనే మా ముందున్న లక్ష్యం. వచ్చే ఐదేళ్ల కోసం ప్రభుత్వ ఏర్పాటునకు మాకు ఒక అవకాశం ఇవ్వండి. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో జమ్మును చేరుస్తాం అని అని అమిత్ షా ప్రసంగించారు.

## సుప్రీంకోర్టులో సందీప్ ఘోష్‌కు ఎదురుదెబ్బ.. పిటిషన్ కొట్టివేత



కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గత నెలలో ఆసుపత్రిలో వైద్యురాలిపై హత్యాచారం జరిగిన సమయంలో.. నిందితుడు సంజయ్ రాయ్‌తోపాటు ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సందీప్ ఘోష్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. అయితే వైద్యురాలి కేసు విచారణను సీబీఐకి బదిలీ చేసిన కోల్‌కత్తా హైకోర్టు.. ఘోష్‌పై అవినీతి ఆరోపణల కేసు దర్యాప్తును సైతం సీబీఐకే అప్పజెప్పింది. ఈ క్రమంలో హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ సందీప్ ఘోష్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. నేడు(శుక్రవారం) ఆయన అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్థివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. తన పదవీకాలంలో ఆర్జీకర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌లో భాగస్వామిగా చేర్చుకోవాలన్న సందీప్ ఘోష్ విజ్ఞప్తిని తిరస్కరించింది. 'ఒక కేసులో నిందితుడిగా ఉన్న మీరు.. కలకత్తా హైకోర్టు విచారిస్తున్న పిటిషన్‌లో జోక్యం చేసుకునే హక్కు లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా ఆగస్టు 9న ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారంతో.. అవినీతి ఆరోపణలను అనుసంధానిస్తూ హైకోర్టు చేసిన కొన్ని వ్యాఖ్యలను తొలగించేందుకు కూడా అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఇదిలా ఉండగా.. 2021 నుంచి సందీప్ ఘోష్ ఆర్‌జీ ఆసుపత్రి ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఆయన హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం నుంచి సీబీఐకి బదిలీ చేయాలని కలకత్తా హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.. ఇక వైద్యురాలి కేసులో సందీప్ ఘోష్‌ను రెండు వారాలుగా విచారించిన అనంతరం సోమవారం సీబీఐ అతన్ని అరెస్టు చేసింది. వైద్య కళాశాలలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసులో కోర్టు ఎనిమిది రోజుల కస్టడీకి అప్పగించింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఘోష్ నివాసంపై శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు చేసింది.

# అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పంటలు నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి ఇరవైదు వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి.

కంది డిప్యూటీ తహాశిల్దార్ కు వినతిపత్రం అందజేత




కంది ,సెప్టెంబర్ 06 డైలీ రిపోర్ట్: సిపిఎం కంది మండల కమిటీ ఆధ్వర్యంలో అకాల వర్షాల వల్ల కూలిపోయిన ఇండ్లు,నష్టపోయిన పంటలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. నర్సిములు మాట్లాడుతూ.. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్నటువంటి వర్షాల వలన కంది మండలంలో చర్ల గూడెం గ్రామంలో ఇండ్లు మరియు పంటలు నష్టపోయాయని, సంబంధిత అధికారులు వెంటనే పర్యటనలు నిర్వహించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇండ్లు కూలిపోయిన వారు లక్షల్లో, పంట నష్టపోయిన వారు వేయిల ల్లో నష్టపోయారని, వీరిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని,నష్టానికి తగినట్టు పరిహారం ఇవ్వాలని అన్నారు. జిల్లా అధికారులు నష్టపోయిన వాటిని వెంటనే పరిశీలించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని అంటున్న మండల అధికారులు స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. వెంటనే మండలాధికారులు పర్యటనలు నిర్వహించి నష్టపరిహారం వచ్చే విధంగా చొరవ చూపాలని లేనియెడల ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ జిల్లా అధ్యక్షులు ఎ.మాణిక్యం,గ్రామ నాయకులు మల్లయ్య, నరేందర్, చిన్న మల్లయ్య, సత్యమ్మ,మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పోలీసులు అధికారులతో సమన్వయ సమావేశం

**సంగారెడ్డి, సెప్టెంబర్ 06 (డైలీ రిపోర్ట్):** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.భవాని చంద్ర అధ్యక్షతన శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణం నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.నరేష్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ఎక్సైజ్ అధికారులు తో ఈనెల 28వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాల సందర్భంగా సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం నందు ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ.భవాని చంద్ర మాట్లాడుతూ సంగారెడ్డి పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లో కేసులు పెండింగ్ ఎన్ని ఉన్నాయో, కనుక్కొని వాటిలో ఎన్ని కేసులు రాజీ చేసి పరిష్కారం చేస్తారో, పోలీసు అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. అన్ని క్రిమినల్ కాంపౌండ్ కేసులు త్వరితగతిన పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని కోరారు.

## సీఎం సహాయనిధికి విరాళాల వెల్లువ



హైదరాబాద్: వరద సహాయక చర్యల నిమిత్తం పలు సంస్థల నుంచి ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు వెల్లువలా వస్తున్నా యి. జీఎంఆర్ గ్రూప్ సంస్థల నుంచి రూ.2.5 కోట్లు విరాళంగా ప్రకటించారు. కెమిలాయిడ్స్ కంపెనీ చైర్మన్ రంగరాజు రూ.కోటి విరాళం ఇవ్వగా, శ్రీచైతన్య విద్యాసంస్థలు రూ.కోటి, విర్కో ఫార్మా రూ.కోటి, అపోలో హాస్పిటల్స్ జేఎండీ సంగీతారెడ్డి రూ.కోటి విరాళంగా అందజేసినట్లు శుక్రవారం సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. అలాగే భువనగిరి ఎంపీ చామల కిరణ్‌రెడ్డి వరద బాధితులకు తన వంతుగా నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ము ఖ్యమంత్రి ప్రత్యేక అధికారి (ఓఎస్డీ) వేముల శ్రీనివాసులును కలిసి రూ.1.85 లక్షల చెక్కు ను అందజేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వాణిజ్య సంఘాలు, కార్పొరేట్ సంస్థలు తమ వంతు విరాళాలు ఇచ్చి వరద బాధితుల పక్షాన నిలవాలని కోరారు.

## రీల్స్ పిచ్చి పాము కాటుకు యువకుడు బలి



కామారెడ్డిజిల్లా: సోషల్‌మీడియాలో పాపులర్ అవ్వాలన్న కోరిక మరో ప్రాణాన్ని బలిగొన్నది. సాహసం చేసి పేరుతెచ్చుకునే మాట అటుంచితే యుక్త వయస్సులోనే ఆయుష్షు పూర్తయిపోయింది. కామారెడ్డి జిల్లా దేశాయిపేటలో శుక్రవారం(సెప్టెంబర్6) విషాద ఘటన జరిగింది. సోషల్‌మీడియాలో వైరల్ అయ్యేందుకు శివరాజు అనే యువకుడు ఏకంగా విష సర్పాన్నే నోటితో కరిచి పట్టుకున్నాడు. ఈ దృశ్యాలను వీడియో తీయాల్సిందిగా స్నేహితులకు చెప్పాడు. ఇంకేముంది షరామామూలుగానే పాము తన సహజ స్వభావంతో యువకున్ని కాటు వేసింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన శివరాజును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శివరాజు తుద్విశ్వాస విడిచాడు. యువకుడు అకారణంగా చనిపోవడంపై కుటుంబసభ్యులు కనీరుమున్నీరవుతున్నారు. పాముకాటుతో మృతిచెందిన శివరాజు ఇటీవల పాములు పట్టడంలో శిక్షణ పొందుతున్నట్లు తెలిసింది.

# అధికారులు క్రమం తప్పకుండా గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేయాలి

వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

రెసిడెన్షియల్ పాఠశాలలో వసతి గృహాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలి

సిఎస్ఆర్ నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలి

సంక్షేమ శాఖలు, విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



**సంగారెడ్డి, సెప్టెంబర్ 06 (డైలీ రిపోర్ట్ ):** జిల్లాస్థాయి అధికారులు క్రమం తప్పకుండా వసతి గృహాలను గురుకుల పాఠశాలలను తనిఖీ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సిఎస్ఆర్ నిధులతో చేపట్టే పనులు పరిశ్రమల యాజమాన్యంతో సమన్వయం చేసి ప్రతి పనులు అందించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కావలసిన మౌలిక సదుపాయాలు అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన టాయిలెట్స్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలి అన్నారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలలో, పాలిటెక్నిక్ కళాశాలలో, జూనియర్ కళాశాలలో కాంపౌండ్ వాల్స్ నిర్మాణం పనులు పూర్తయిన కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలోని ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాలు, మైనార్టీ పాఠశాలలను జిల్లా అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, ఆయా వసతి గృహాలలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వసతి గృహాలను తనిఖీ చేసినప్పుడు విద్యార్థులతో కలిసి భోజనం చేయడంతో పాటు రాత్రి బస కార్యక్రమం నిర్వహించాలని, వసతి గృహాలలో కిచెన్ షెడ్లు, టాయిలెట్లు, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా నిర్వహణ లోపం తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో ప్రతిరోజు సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్లో అధికారులు తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాలలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, కూరగాయలు లేని సాంబార్ వడ్డిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, మెనూ ప్రకారం భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు మైనారిటీ పాఠశాలల్లో చేసిన వివిధ అభివృద్ధి పనులకు ,మౌలిక వసతుల కల్పన చేసిన పనులను సంబంధించిన రికార్డులు వెంటనే సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనులుపూర్తి అయితే వెంటనే సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు అందజేయాలని సూచించారు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లిస్తేనే పనులు చేయడానికి ముందుకు వస్తారన్నారు. సిఎస్ఆర్ నిధులతో , అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో నాణ్యతతో కూడిన పనులు చేయించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయం పాలన పాటించాలన్నారు. ఉచిత విద్యుత్ కావలసిన పాఠశాలల వివరాలు విద్యుత్ శాఖ కు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి దేవుజా, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, బిసి సంక్షేమాధికారి జగదీష్, సిపిఓ బాలశౌరి, ఈ ఈ డబ్ల్యూ ఐడిసి శ్రీనివాస్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉస్మానియాకు ప్రపంచ స్థాయి గుర్తింపు

వైద్య విద్య అంటేనే కోఠి మెడికల్ కాలేజీ, అదొక బ్రాండ్


రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సుల్తాన్‌బజార్: ఉస్మానియా మెడికల్ కళాశాల అంటేనే ఒక బ్రాండ్, ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ అంటే ఉస్మానియా అనే ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో వైద్య బాలుర, బాలికలకు వేర్వేరుగా నూతన హాస్టల్ బ్లాక్ భవనాలను రూ.103 కోట్ల నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించేందుకు గాను శుక్రవారం భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దామోదర రాజ నర్సింహ, రాష్ట్ర రవాణ, బీసీ శాఖల మంత్రి పొన్నం ప్రభా కర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా చోంగ్తు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డీఎంఈ డాక్టర్ వాణి, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, టీజీఎంఎస్ఐడీసీ ఎమ్డీ హేమంత్ బోర్కాడే, ఛీఫ్ ఇంజనీర్ పి.దేవేందర్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్ రెడ్డిలతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మంత్రి దామోదర మాట్లాడుతూ, 30 ఏండ్లుగా పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. జూడాలకు కొన్నేండ్లుగా ట్కస్టెఫెండ్ నెలల తరబడి అందలేదు. ఈ సమస్యను తాము పరిష్కరించి ప్రతి నెల పదో తేదీలోపు వచ్చేలా చేయడం జరిగిందన్నారు. విద్య, వైద్యశాఖలు ఎంతో కాంప్లికేటెడ్‌తో కూడుకున్నవని అన్నారు. దేవాలయానికి ఎంత నమ్మకంతో వెళుతామో.. అంతే నమ్మకంతో వైద్యాలయానికి వెళుతామన్నారు.




## ట్రెండింగ్‌లో దేవర చుట్టమల్లె సాంగ్..

**పా**న్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు సినిమాల్లో ఒకటి దేవర టైటిల్‌లో రోల్ పోషిస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ దేవర రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా చుట్టమల్లె మెలోడీ ట్రాక్‌ను విడుదల చేశారని తెలిసిందే. తారక్, జాన్వీకపూర్ కెమిస్ట్రీలో వచ్చే ఈ డ్యుయెట్ సాంగ్ సినిమాకే హైలెట్‌గా ఉండబోతుందని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఈ సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఇంప్రెస్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. చుట్టమల్లె పాట విడుదలైన నెలలోపే (29 రోజులు) యూట్యూబ్‌లో 100 మిలియన్లకుపైగా వ్యూస్‌తో నంబర్ 1 స్థానంలో ట్రెండింగ్‌లో నిలుస్తుంది. ఈ సాంగ్ నాలుగు వారాలుగా మోస్ట్ ట్రెండింగ్ జాబితాలో కొనసాగుతుండటం విశేషం. తారక్, జాన్వీకపూర్ కాంబోను మూవీ లవర్స్ ఏ స్థాయిలో ఎంజాయ్ చేస్తున్నారో చెప్పేందుకు ఇది ఒక ఉదాహరణ. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను శిల్పా రావు పాడింది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## కూలీ నెం 1421.. పవర్‌ఫుల్ లుక్‌లో రజనీకాంత్

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కూలీ'. సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమా నుంచి రజనీకాంత్ కొత్త పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో ఆయన దేవా అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. చేతిలో 1421 నెంబర్ కలిగిన బ్యాడ్జీ పట్టుకొని రజనీకాంత్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ సినిమాలో నాగార్జున, సత్యరాజ్, శృతిహాసన్, ఉపేంద్ర వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదలకానుంది. ఇదిలావుండగా రజనీకాంత్ నటించిన బ్లాక్‌బస్టర్ హిట్ 'జైలర్' సినిమా సీక్వెల్ గురించి దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, త్వరలోనే చిత్రాన్ని సెట్స్‌మీదకు తీసుకొస్తామని తెలిపారు. అక్టోబర్‌లో ప్రారంభంకానున్నట్లు సమాచారం.






## కంగనారనౌత్‌కు ఎమర్జెన్సీ కష్టాలు.. విడుదలను వాయిదా వేయాలన్న సెన్సార్ బోర్డ్

**మా**జీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా, 1975-77 నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల నేపథ్యంలో రూపొందిస్తున్న 'ఎమర్జెన్సీ' సినిమా విడుదలను వాయిదా వేయాలని కేంద్ర సెన్సార్ బోర్డ్ చిత్ర నిర్మాతలను ఆదేశించింది. ఇందిరాగాంధీ పాత్రను పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో కంగనారనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఈ నెల 6న రిలీజ్ కావాల్సి ఉంది. అయితే సినిమాలో ఓ వర్గం మనోభావాలను కించపరిచారని, ఆపరేషన్ బ్లూస్టార్ నేపథ్యంలో మతపరంగా సున్నితమైన అంశాలు ఇందులో ఉన్నాయని సెన్సార్ బోర్డ్ చిత్రాన్ని వాయిదా వేసింది. విషయాన్ని ప్రస్తావిస్తూ ఢిల్లీ సిక్కు గురుద్వార మేనేజ్‌మెంట్ కమిటీ కేంద్ర సెన్సార్ బోర్డ్‌కు లేఖ రాసింది. ఈ సినిమా ట్రైలర్‌లో తమ వర్గంపై అనుమానం రేకెత్తించేలా సున్నితమైన అంశాలను ప్రస్తావించారని, అవాస్తవాలను చూపించారని గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో చిత్ర విడుదలను వాయిదా వేశారు. ఇదిలావుండగా ఈ సినిమాపై నిషేధం విధించాలని దేశవ్యాప్తంగా పలు సిక్కు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## పదేండ్లుగా ఆయన్ని ప్రేమిస్తున్నా!

దక్షిణాది సినీరంగంలో సాయిపల్లవి పంథాయే వేరు. గ్లామర్ పాత్రలకు పూర్తి దూరంగా ఉంటుందీ భామ. చూడగానే పక్కింటి అమ్మాయిలా కనిపించే ఈ తమిళ సొగసరి ఎలాంటి నాటకీయత లేని సహజమైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంటుంది. అందుకే ఈ భామకు దక్షిణాదిలో అభిమానగణం ఎక్కువ. 'ప్రేమమ్'తో మలయాళ సినీరంగంలో మొదలైన ఆమె ప్రయాణం ఇప్పుడు బాలీవుడ్ వరకూ వెళ్లింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ప్రేమ, పెళ్లి గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఇప్పటివరకు మీరు ప్రేమలో పడలేదా? అని అడగ్గా.. మహాభారత ఇతిహాసం తనకు చాలా ఇష్టమని, అందులో అభిమన్యుడి పాత్రను తాను ఎంతగానో ప్రేమిస్తానని చెప్పుకొచ్చింది. 'గత పదిహేడేండ్లుగా అభిమన్యుడి పాత్ర గురించి ఏదో కొత్త విషయం తెలుసుకుంటూనే ఉన్నా. ఆయనకు సంబంధించిన ఏ కథ అయినా నాలో ఆసక్తిని పెంచుతుంది. ఓరకంగా చెప్పాలంటే గత పదేండ్లుగా ఆయన ప్రేమలో ఉన్నా అంటూ నవ్వుతూ తన మనసులోని మాటను బయటపెట్టింది. సాయిపల్లవి సమాధానం విన్న నెటిజన్లు ఆమెలో హాస్యచతురత కాస్త ఎక్కువేనని కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం సాయిపల్లవి తెలుగులో 'తండేల్', తమిళంలో 'అమరన్', హిందీలో 'రామాయణ' సినిమాలతో బిజీగా ఉంది.

## వైద్యుల హెచ్చరికతో పెద్ద ముప్పు తప్పింది: విక్రమ్



కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ ఇటీవలే తంగలాన్ మూవీతో ప్రేక్షకులను అలరించాడు. పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో డిఫరెంట్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. ఆగస్టు 15న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ మూవీలో పార్వతి తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటించారు.అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన విక్రమ్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. శంకర్ తెరకెక్కించిన ఐ మూవీ కోసం బరువు తగ్గినట్లు వెల్లడించారు. దాదాపు 86 కిలోల నుంచి ఏకంగా 52 కేజీలకు తగ్గానని తెలిపారు. అయితే తన శారీరక మార్పులతో తీవ్రమైన సమస్య నుంచి బయటపడ్డానని వివరించారు. 50 కంటే బరువు తగ్గితే మీ శరీరంలో అవయవాలు పనిచేయవని డాక్టర్ హెచ్చరించినట్లు తెలిపారు. ఆర్గాన్స్ ఫెయిల్ అయితే.. మిమ్మల్ని ఎలా ట్రీట్ చేయాలో కూడా మాకు అర్థం కాదంటూ వైద్యులు చెప్పారని గుర్తు చేసుకున్నారు. అంతేకాకుండా కాశీ అనే మూవీలో విక్రమ్ అంధుడి పాత్రలో నటించారు. ఈ పాత్ర కోసం విపరీతమైన శారీరక మార్పులకు ప్రయత్నించానని తెలిపారు. ఆ చిత్రంలో నటించాక దాదాపు మూడు నెలలపాటు సరిగా చూడలేకపోయానని విక్రమ్ వెల్లడించారు. ఆ మూవీలో అంధుడిగా కనిపించడానికి కళ్లు పైకెత్తి చూడాల్సి వచ్చేదని.. ఆ ఎఫెక్ట్ నా కంటి చూపుపై తీవ్ర ప్రభావం చూపిందని వివరించారు. దీంతో మెల్లకన్ను వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్స్ వార్నింగ్ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.



## రీటేక్.. అనే పదమే నా చెవులకు ఇంపు: అనుపమా పరమేశ్వరన్

**అ**నుపమా పరమేశ్వరన్ స్పీడ్ మామూలుగా లేదు. 'టిల్లూ స్క్వేర్'తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం షూటింగ్‌ల్లో బిజీబిజీ. ఈ అందాలభామ చేతిలో ప్రస్తుతానికి ఆరు సినిమాలున్నాయి. వచ్చే ఏడాది వరకూ కొత్త సినిమాలకు డేట్స్ ఇచ్చే పరిస్థితి లేదట. అంత బిజీ ప్రస్తుతం అనుపమ. రీసెంట్‌గా తన నట ప్రయాణం గురించి ఆసక్తికరంగా వట్లాడింది అనుపమ..'కంఫర్ట్ జోన్‌లో సినిమాలు చేయడం నాకు అస్సలు నచ్చదు. అలా పనిచేయడం చాలా బోరింగ్. భిన్నమైన సినిమాల ప్రయాణమంటేనే నాకిష్టం. ప్రయోగాత్మకమైన పాత్రలు చేసినప్పుడు కలిగే సంతృప్తి గురించి మాటల్లో చెప్పలేం. నటిగా ఛాలెంజిగ్ రోల్స్‌నే ఎక్కువగా ఇష్టపడతా. సెట్‌లో డైరెక్టర్ రీటేక్స్ అడిగినప్పుడు నాలో ఉత్సాహం ఉరకలేస్తుంది. ఎన్ని టేకులైనా విసుగు లేకుండా చేస్తా. 'బాగా నటించావ్' అనే పదం కంటే 'రీటేక్' అనే పదమే నా చెవులకు ఇంపుగా ఉంటుంది. అలా ఉంటేనే నటనలో మరింత పరిపక్వత పొందగలం' అంటూ చెప్పుకొచ్చింది అనుపమ.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707